# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక








సంపుటి - 1 సంచిక - 325 శనివారం 6 జనవరి 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు - 6 వెల - 3/-

Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad




## యూపీఎస్సీ ఛైర్మన్ మనోజ్ సోనీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**జనవరి 5 ప్రజావినికిడి,:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి శుక్రవారం యూపీఎస్సీ ఛైర్మన్ డాక్టర్ మనోజ్ సోనీని మర్యాదపూర్వకంగా కలిశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన నేడు... రెండో రోజు కొనసాగుతోంది. ఇందులో భాగంగా యూపీఎస్సీ ఛైర్మన్‌తో భేటీ అయ్యారు. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌లతో పాటు సీఎస్ శాంతికుమారి, ఇద్దరు ఐఏఎస్ అధికారులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. యూపీఎస్సీ తరహాలో తెలంగాణల పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పకడ్బందీగా తీర్చిదిద్దుతామని... ప్రశ్నాపత్రాల లీకేజీ లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు ఇదివరకే ప్రకటించారు. ఈ నేపథ్యంలో టీఎస్పీఎస్సీ ప్రక్షాళనపై యూపీఎస్సీ ఛైర్మన్‌తో చర్చించినట్లుగా తెలుస్తోంది. పరీక్షలకు సంబంధించి యూపీఎస్సీ అవలంబించే విధానాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



**జనవరి 5 ప్రజావినికిడి,:**
నగరంలో ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రజావాణిలో భూవివాదాలకు సంబంధించి అంశాలే ఎక్కువగా కనిపించాయి. ప్రజావాణిలో తమ సమస్యలు చెప్పుకోవడానికి తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ప్రజలు, బాధితులు శుక్రవారం తరలి వచ్చారు. అయితే ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ప్రజావాణికి డబుల్ బెడ్ రూమ్ కోసం వస్తున్న దరఖాస్తుల సంఖ్య తగ్గింది. కానీ భూకబ్జాలపై ఫిర్యాదులు మాత్రం వెల్లువెత్తుతూనే ఉన్నాయి. అందులోనూ రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులే భూ కబ్జాలకు పాల్పడినట్లు ఫిర్యాదులతో ప్రజావాణికి బాధిత ప్రజానీకం క్యూకడుతూ అందుకు సంబంధించిన తమ అర్జీలను అధికారులకు సమర్పిస్తున్నారు.
అటు 317 జీవో కారణంగా తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులు ప్రజావాణిలో అధికారులకు మొర పెట్టుకున్నారు. మొత్తంగా ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, ప్రజావాణి నోడల్ ఆఫీసర్‌గా ఉన్న హరిచందన నల్గొండ కలెక్టర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో ఐఏఎస్ దివ్యకి బాధ్యతలు అప్పగించడం జరిగింది. గతంలో ఆదిలాబాద్ కలెక్టర్‌గా పని చేసిన దివ్యకి ప్రజావాణి ఇంఛార్జి బాధ్యతలు అప్పగించడం జరిగింది.

## సంక్షేమ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ కుట్ర
## నిరసన కార్యక్రమాలకు కె టి అర్ పిలుపు

**జనవరి 5 ప్రజావినికిడి,:**
హైదారాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు లబ్ధి కలిగిస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రస్తుత ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలతో కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ%ా% ప్రజలకు లబ్ధి కలిగించే సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేయడం



పట్ల పార్టీ తరఫున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.
%గృహలక్ష్మి, దళిత బంధు, గొర్రెల పంపిణీ వంటి పథకాలను రద్దు చేయకుండా లబ్ధిదారుల తరఫున ప్రభుత్వం పైన ఒత్తిడి తెస్తామని చెప్పారు. దళిత బంధు, గొర్రెల పంపిణీ రద్దు చేయడం అంటే బలహీనవర్గాలకు, దళితులకు తీరని ద్రోహం చేసినట్లేనని తెలిపారు. పట్టణాలకు గత ప్రభుత్వం కేటాయించిన నిధులు, ఆర్ అండ్ బీ, పంచాయితీ రాజ్ రోడ్ల వంటి అభివృద్ధి కార్యక్రమాలను కూడా రద్దు చేస్తున్నదని కేటీఆర్ అన్నారు

## దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పిటిషన్‌పై విచారణను వాయిదా



**జనవరి 5 ప్రజావినికిడి,:**
గత ప్రభుత్వం నామినేట్ చేసిన ఎమ్మెల్సీలను గవర్నర్ తిరస్కరించడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు వేసిన పిటిషన్ మీద విచారణను హైకోర్టు వాయిదా వేసింది. పిటిషన్‌కు విచారణార్హతపై తేలుస్తామని సీజే ధర్మాసనం శుక్రవారం తెలిపింది. తదుపరి విచారణను జనవరి 23వ తేదీకి వాయిదా వేసింది. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. అయితే గవర్నర్ సౌందరరాజన్ ఈ ఫైలును తిరస్కరించారు. దీంతో వీరిద్దరు హైకోర్టును ఆశ్రయించారు. ఆర్టికల్ 171 ప్రకారం కేబినెట్ నిర్ణయాన్ని గవర్నర్ ఆపడానికి వీల్లేదని పిటిషనర్లు కోర్టుకు వెల్లడించారు. అదే సమయంలో ఆర్టికల్ 361 ప్రకారం పిటిషన్‌కు అర్హత లేదని గవర్నర్ తరఫు న్యాయవాది... హైకోర్టు దృష్టికి తీసుకు వెళ్లారు. అయితే హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

## దేశంలోనే బెస్ట్ పోలీసు స్టేషన్
### అవార్డు అందుకున్న రాజేంద్రనగర్ పిఎస్




2లో.

## ప్రభుత్వాన్ని నడపలేక బీఆర్ఎస్ గుర్తింపును రద్దు చేయాలని లేఖలు రాస్తున్నారు



## బీఆర్ఎస్‌లో వర్గపోరు...

### ఎమ్మెల్సీ-మాజీ ఎమ్మెల్యే అనుచరుల మధ్య వాగ్వాదం

**తెలంగాణ భవన్‌లో లోక్ సభ ఎన్నికల సన్నాహక సమావేశాలు**

**సమావేశంలో మహేందర్ రెడ్డి, పైలట్ రోహిత్ రెడ్డి అనుచరుల మధ్య వాగ్వాదం**

**సర్దిచెప్పిన మాజీ మంత్రి హరీశ్ రావు**



**జనవరి 5 ప్రజావినికిడి,:**
బీఆర్ఎస్‌లో వర్గపోరు బయటపడింది. చేవెళ్లలో ఇద్దరు ముఖ్య నాయకుల అనుచరుల మధ్య వాగ్వాదం జరిగింది. లోక్ సభ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా శుక్రవారం తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మహేందర్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమయంలో వర్గపోరు బయటపడింది.సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అనుచరుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మహేందర్ రెడ్డి మాట్లాడే సమయంలో రోహిత్ రెడ్డి వర్గం పెద్ద ఎత్తున నినాదాలు చేసింది. ఈ క్రమంలో ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేల మధ్య వాగ్వాదం తలెత్తింది. మాజీ మంత్రి హరీశ్ రావు కలుగజేసుకొని ఇరువురికి సర్ది చెప్పవలసి వచ్చింది.

## ఖమ్మం లోక్‌సభ నుంచి సోనియా గాంధీ పోటీ?

- అధిష్ఠానం నుంచి రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యులకు అందిన సమాచారం
- సోనియా పోటీకి ఏర్పాట్లపై దృష్టిసారించిన రాష్ట్ర నేతలు
- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి సహా పలువురు మంత్రులు నామినేషన్ పత్రాలు సమర్పించే అవకాశం



**జనవరి 5 ప్రజావినికిడి,:**
కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తెలంగాణ నుంచి లోక్‌సభ బరిలో నిలవబోతున్నారా? ఖమ్మం లోక్‌సభ నుంచి ఆమె పోటీ చేయడం ఖరారైందా?.. అంటే ఔననే సమాధానమిస్తున్నాయి ఆ పార్టీ వర్గాలు. సోనియా ఖమ్మం నుంచి పోటీ చేస్తారంటూ అధిష్ఠానం నుంచి రాష్ట్ర పార్టీ కీలక నేతలకు సమాచారం అందినట్టు రిపోర్టులు వెలువడుతున్నాయి. ఈ మేరకు కార్యాచరణను రూపొందించాలని అధిష్ఠానం సూచన చేయడంతో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లపై దృష్టి సారించినట్టుగా తెలుస్తోంది. తెలంగాణ నుంచి సోనియా పోటీ చేయాలని కోరుతూ టీపీసీసీ డిసెంబర్ నెలలోనే తీర్మానం చేసింది. ఇటీవల రెండోసారి కూడా తీర్మానం చేయగా దానిపై సోనియా గాంధీ సానుకూలంగా స్పందించారు. గతంలోనే సూత్రప్రాయ అంగీకారం తెలిపినప్పటికీ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది తాజాగా క్లారిటీ వచ్చింది. సోనియా తెలంగాణలో పోటీ చేస్తే ఇటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాల్లో కూడా సానుకూల ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ పార్టీ వర్గాలు లెక్కలు వేస్తున్నాయి.

# దేశంలోనే బెస్ట్ పోలీసు స్టేషన్

## అవార్డు అందుకున్న రాజేంద్రనగర్ పిఎస్




**జనవరి 5 ప్రజావినికిడి,:**
దేశంలోనే అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ నిలిచింది. దేశంలోనే బెస్ట్ పిఎస్ ట్రోఫీని కేంద్ర హెూం శాఖ శుక్రవారం ప్రదానం చేసింది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరిగిన అన్నిరాష్ట్రాల డిజిపిల సమావేశంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేతుల మీదుగా రాజేంద్రనగర్ పిఎస్ హౌస్ ఆఫీసర్ బి.నాగేంద్ర బాబు ట్రోఫిని అందుకున్నారు. పోలీసు స్టేషన్ల పని తీరుపై కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ నిర్వహించిన సర్వేలో సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ అత్యుత్తమ పోలీసు స్టేషన్‌గా నిలిచింది.
అత్యధిక కేసులు నమోదవుతున్న పోలీసుస్టేషన్‌గా కొన్నేళ్లుగా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ రికార్డు సృష్టించింది. కేసుల నమో దుతో పాటు విచారణ వేగవంతం చేసి, కేసులను ఛేదించడం, హత్య కేసుల్లో అత్యంత త్వరగా నిందితులను గుర్తించడం లాంటి పలు అంశాలల్లో ఈ పోలీసు స్టేషన్ పనితీరు, పోలీసుల ప్రతిభను కేంద్రం హెూం శాఖ గుర్తించింది. జైపూర్‌లో జనవరి 5 నుంచి 7 వరకు జరగనున్న పోలీస్ ఉన్నతాధికారుల సమావేశంలో అవార్డును అందజేశారు. కేంద్రమంత్రి అమిత్ షా చేతుల మీదుగా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ సిఐ నాగేంద్ర బాబు బెస్ట్ పిఎస్ అవార్డు తీసుకున్నారు.
గత ఏడాది దేశ వ్యాప్తంగా బెస్ట్ పీఎస్ అవార్డు కోసం పరిశీలించగా సుమారు 17వేలకుపైగా పోలీస్ స్టేషన్ల పేర్లు వెళ్లాయి. అందులో మొదటగా 74 పోలీస్ స్టేషన్లను షార్ట్‌లిస్ట్ చేశారు. ఆ 74 పోలీసుస్టేషన్‌లలో మూడు ఉత్తమ పోలీస్ స్టేషన్లను ఎంపిక చేయగా తెలంగాణకు చెందిన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ అగ్రస్థానం దక్కించుకుంది. రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ తరువాత జమ్ముకాశ్మీర్‌కు చెందిన షేర్‌ఘరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సెరంపూర్ (చందన్‌నగర్ కమిషనరేట్) పోలీస్ స్టేషన్లు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

### రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు

ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ ఎంపిక కావడంపై సిఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎస్‌హెచ్‌ఓ బి.నాగేంద్రబాబుకు అభినందనలు తెలిపారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు మొదటి స్థానం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు. 2023లో దేశంలోనే అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ స్టేషన్‌గా మొదటి స్థానంలో నిలిచినందుకు డిజిపిల సమావేశంలో కేంద్ర హెూంశాఖమంత్రి నుంచి ట్రోఫీని అందుకున్న రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు అభినందనలు అని ట్వీట్ చేశారు.

# పింకి హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

**జనవరి 5 ప్రజావినికిడి,:** సంచలనం సృష్టించిన పింకి హత్య కేసులో నలుగురు నిందితులకు జీవితఖైదు శిక్ష, ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధిస్తూ కూకట్‌పల్లి కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. శేరిలింగంపల్లి, కొండాపూర్‌కు చెందిన పింకి అలియాష్ బింగి అలియాష్ షాలినిని అత్తా, భర్త, బంధువులు కలిసి 30.01.2018లో హత్య చేశారు. ఈ హత్య అప్పట్లో సంచలనం సృష్టించింది. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నిందితులు మమతా జా, అనిల్ జా ఇద్దరు భార్యభర్తలు, అమర్‌కాంత్ జా(24), వికాస్ కశ్యాప్ అలియాస్ బికాస్ కశ్యాప్, పింకిని వివాహం చేసుకున్నాడు. అందురూ కలిసి బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్నారు. మమతా జా, వికాస్ కశ్యాప్ మధ్య వివాహేతర సంబంధం ఉంది.వీరి సంబంధానికి పింకి అడ్డుగా ఉండడంతో తొలగించాలని ప్లాన్ వేశారు. దానికి అమర్‌కాంత్ జా, అనిల్ జా సహకారం తీసుకున్నారు. ఈ క్రమంలోనే 27.01.2018 రాత్రి 11 గంటలకు పింకితో మమతా జా, అనిల్ జా కావాలనే గొడవపెట్టుకుని ఆమె మెడ, కాళ్లను గట్టిగా పట్టుకోవడంతో వికాస్, అమర్ కాంత్ ఆమె కడుపు, మిగతా శరీర భాగాలపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది. తర్వాత నిందితులు పింకి మృతదేహాన్ని బాత్‌రూంలో వేసి ముక్కలుగా కోసి పాలితిన్ బ్యాగులో పార్ట్‌లు పెట్టి బొటానికల్ గార్డెన్ వద్ద పేడేశారు. మృతదేహం పడిన విషయం తెలుసుకున్న అప్పటి గచ్చిబౌలి ఇన్స్‌స్పెక్టర్ ఎం. గంగాధర్ సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టంకు పంపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్షాలను సేకరించి కోర్టులో సమర్పించడంతో నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్ లో సత్తా చాటిన సిద్దిపేట.. హరీశ్ రావు హర్షం

### జాతీయస్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన సిద్దిపేట
### సిద్దిపేట మరో మైలురాయిని చేరిందన్న హరీశ్ రావు

**జనవరి 5 ప్రజావినికిడి,:**
స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో సిద్దిపేట సత్తా చాటింది. జాతీయస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. సిద్దిపేట అగ్రస్థానంలో నిలిచి అవార్డు దక్కించుకోవడంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి కీర్తిపతాకలో సిద్దిపేట మరో మైలురాయిని చేరిందని ప్రశంసించారు. అవార్డులు అంటేనే సిద్దిపేట... సిద్దిపేట అంటే అవార్డులు అని మరోసారి రుజువైందన్నారు. ప్రజల సహకారం, ప్రజాప్రతినిధుల చొరవ, అధికారుల పనితీరుకు ఈ అవార్డు నిదర్శనమని అన్నారు.



# తెలంగాణ కొత్త హైకోర్టు భవన నిర్మాణానికి 100 ఎకరాల కేటాయింపు

### బుద్వేల్, రాజేంద్రనగర్‌లో 100 ఎకరాల్లో
### కొత్త హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వ నిర్ణయం
### భూమిని కేటాయిస్తూ జీవో విడుదల
### వారసత్వ కట్టడంగా పాత భవనం!

**జనవరి 5 ప్రజావినికిడి,:**
తెలంగాణలో కొత్త హైకోర్టు భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. హైకోర్టు నిర్మాణానికి 100 ఎకరాల భూమిని కేటాయిస్తూ శుక్రవారం జీవోను విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ప్రేమావతిపేట్, బుద్వేల్ గ్రామ పరిధిలోని 100 ఎకరాలను న్యాయశాఖకు కేటాయిస్తున్నట్లు జీవో నెంబర్ 55లో పేర్కొంది. బుద్వేల్‌లోని 2500 ఎకరాలను వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయానికి 1966లో అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిలోని 100 ఎకరాలను హైకోర్టు భవనానికి కేటాయించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది. ఈ స్థలంలో నూతన హైకోర్టు భవన నిర్మాణం జరిగే వరకు హైకోర్టు కార్యకలాపాలు అన్నీ పాత భవనంలోనే జరుగుతాయి. ఆ తర్వాత దానిని వారసత్వ కట్టడంగా పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది



# సోనియాగాంధీ ఖమ్మం నుంచి పోటీ చేస్తే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం: వీహెచ్

**జనవరి 5 ప్రజావినికిడి,:**
రానున్న లోక్ సభ ఎన్నికల్లో సోనియాగాంధీ ఖమ్మం నుంచి పోటీ చేస్తే ఆ ప్రభావం అన్ని స్థానాలలో ఉంటుందని.. ఆమెను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంత రావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎంపీ ఎన్నికల్లో సోనియాగాంధీ, కాంగ్రెస్ గెలుపు కోసం ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ హామీలను నెరవేరుస్తుందని బీజేపీ, బీఆర్ఎస్‌లకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ విడుదల చేసిన కాంగ్రెస్ 420 బుక్‌లెట్‌పై వీహెచ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్ష నేతలకు పనిలేక బుక్ లెట్‌తో తమ పార్టీని బద్నాం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. మేం ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు గెలిపించారన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎన్ని హామీలు నెరవేర్చిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులకు మూడెకరాల భూమి... ఇంటికో ఉద్యోగం హామీలు ఏమయ్యాయి? అని ఆయన ప్రశ్నించారు.



# ప్రభుత్వాన్ని నడపలేక బీఆర్ఎస్ గుర్తింపును రద్దు చేయాలని లేఖలు రాస్తున్నారు

### - హామీలు కాంగ్రెస్ పార్టీకి గుదిబండలా మారాయన్న జగదీశ్ రెడ్డి
### -ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చారని విమర్శలు
### - బీఆర్ఎస్‌ను రద్దు చేస్తే ప్రశ్నించే వారు ఉండరనేది వారి ఉద్దేశ్యమని వ్యాఖ్య

**జనవరి 5 ప్రజావినికిడి,:**
బీఆర్ఎస్ గుర్తును రద్దు చేయాలన్న కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఇచ్చిన హామీలు గుదిబండలా మారాయని కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుందని విమర్శించారు. శుక్రవారం సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వాన్ని నడపలేక బీఆర్ఎస్ గుర్తింపును రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు లేఖలు రాస్తున్నారని విమర్శించారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చారని... ఈ విషయాన్ని తాము ముందే చెప్పామన్నారు. హామీలను అమలు చేయకుంటే ప్రజలే మిమ్మల్ని రద్దు చేస్తారని హెచ్చరించారు.
ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చమని తాము అడుగుతుంటే... బీఆర్ఎస్ పార్టీని రద్దు చేయమని చెప్పడం సరికాదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌ను రద్దు చేస్తే తమని ప్రశ్నించే వారు ఉండరనేదే వారి ఉద్దేశం అన్నారు. తాము 420 గాళ్లమని వాళ్లకు వాళ్లే చెప్పుకునే విధంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో చర్చ ప్రారంభమైందని... ఇది కేవలం ఆరంభం మాత్రమే అన్నారు.
పథకాల అమలుకు ప్రభుత్వపరంగా సమయం తీసుకుంటే తప్పులేదు కానీ, ప్రజలను ఎక్కువ కాలం మోసం చేయాలని చూస్తే సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. తెలిసీ.. తెలియక ఇచ్చిన హామీలు అధికార పార్టీకి గుదిబండలా మారాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అక్షరాలా 420 ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. హామీల గురించి ప్రజలకు చెప్పే బాధ్యత.. ప్రతిపక్షంగా తమపై ఉందన్నారు. పరిపాలన చేతకాకుంటే అనుభవజ్ఞుల సూచనలు, సలహాలు తీసుకొని ముందుకు సాగాలని హితవు పలికారు.



# సంక్రాంతి పండుగకు 4,484 ప్రత్యేక బస్సులు

### నేటి నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి
### సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులను నడుపుతాం
### : టిఎస్ ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్

**జనవరి 5 ప్రజావినికిడి,:**
రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్ ఆర్టీసి) సంక్రాంతి పండుగను పురస్కరించుకొని 4,484 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు టిఎస్ ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ తెలిపారు. నేటి నుంచి (జనవరి 6 నుంచి 15వ తేదీ వరకు) హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు ఈ బస్సులు నడపాలని నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు. అలాగే ఈ ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కూడా వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సంక్రాంతికి స్వగ్రామాలకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.
ఎలాంటి పెంపుదల లేకుండా సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు. ఉప్పల్ క్రాస్ రోడ్, ఎల్బీ నగర్, అరంఘాడ్, కెపిహెచ్‌బి తదితర ప్రాంతాల నుంచి బస్సులు ఎక్కేందుకు వేచి ఉన్న ప్రయాణికుల కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసినట్లు సజ్జనార్ తెలిపారు. బస్‌భవన్, మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ల ద్వారా రద్దీ ప్రాంతాల్లో పరిస్థితిని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తారని ఆయన తెలిపారు. ప్రజలు త్వరగా గమ్యస్థానాలకు చేరుకునేలా టోల్‌ప్లాజాల వద్ద టిఎస్ ఆర్టీసి బస్సుల కోసం ప్రత్యేక లేన్లు ఏర్పాటు చేశామని, అధిక ఛార్జీలు చెల్లించి ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణించవద్దని, పౌరులు ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించాలని ఆయన కోరారు.




### అధికారులతో ఎండి సమీక్ష



ఈ క్రమంలోనే ప్రత్యేక బస్సులకు సంబంధించి ఆర్టీసి అధికారులతో ఎండి సజ్జనార్ శుక్రవారం బస్ భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆర్ఎంలు, డిఎంలు, జిల్లా అధికారులు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణతో పాటు ఎపి, కర్ణాటక, మహారాష్ట్ర ఇంటర్ స్టేట్ సర్వీస్‌లపై అధికారులు ఫోకస్ చేయాలని ఎండి సూచించారు.

# వెట్టి చాకిరీకి స్థానం లేదు.

## బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కట్టుదిట్టమైన చర్యలు :సీపీ సుధీర్ బాబు ఐపీఎస్..








ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
సంతోషంగా చదువుకుంటూ,ఆట పాటలతో సాగాల్సిన పిల్లల బాల్యాన్ని చిదిమేస్తున్న బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ పిలుపునిచ్చారు.
శుక్రవారం రోజు నెరెడ్ మెట్ లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ పదవ సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ, సమాజంలో బాల కార్మిక వ్యవస్థ ఒక వ్యాధిలాగా మారిందని, అది ఎంతో మంది అమాయక పిల్లల బాల్యాన్ని నాశనం చేస్తుందని పేర్కొన్నారు. ప్రధానంగా తల్లిదండ్రుల పేదరికం వల్ల పిల్లలు వెట్టి చాకిరీ కోరల్లో చిక్కుకుని తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా, తమ పిల్లలను మాత్రం వెట్టి చాకిరీ కూపంలోకి నెట్టకూడదని,పిల్లల చదువు కోసం ప్రభుత్వం ఉచితంగా ఎన్నో కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని,వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వెట్టి చాకిరీ నిర్మూలన లో ప్రజా భాగస్వామ్యం ఉండాలని,ప్రజలు కూడా దాన్ని తమ నైతిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.
రాచకొండ పరిధిలో మానవ అక్రమ రవాణా మరియు బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీపీ పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా మీద ఉక్కు పాదం మోపుతున్నమని, ప్రత్యేక బృందాల ద్వారా ఎంతో మందిని రక్షించామని,కేసులు నమోదు చేశామని తెలిపారు.ఒడిషా, బీహార్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఇటుక బట్టి కార్మికుల పిల్లలు విద్యకు దూరం కాకూడదు అని వారి నివాస ప్రాంతం లోనే వర్క్ సైట్ పాఠశాలలను నడుపుతున్న విషయం గుర్తు చేశారు.
ఈ కార్యక్రమంలో డీసీపీ ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్,ఏసిపి వెంకటేశం,రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి శ్రీ కృష్ణ రెడ్డి,రంగారెడ్డి జిల్లా సిడబ్ల్యుసి చైర్మన్ శ్రీ నరేంద్ర,మేడ్చల్ జిల్లా సిడబ్ల్యుసి శ్రీ రాజా రెడ్డి,యాదాద్రి సిడబ్ల్యుసి చైర్మన్ శ్రీమతి జయశ్రీ,రంగారెడ్డి జిల్లాడిప్యూటీ వైద్యాధికారిణి డాక్టర్ గీత,డి.సి.పి.ఓ.లు ప్రవీణ్,ఇంతియాజ్, సైదులు,బాలరక్ష భవన్ అధికారులు, చైల్డ్,లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు,విద్యాశాఖ అధికారులు,బచపన్ బచావో ఆందోళన్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, చైల్డ్ లైన్ అధికారులు ఇతర రాచకొండ పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిల్మ్ నగర్ లో ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన ఆన్ లైన్ దరఖాస్తు నింపిన బిజెపి నేతలు..




ప్రజావినికిడి,(ఫిల్మ్ నగర్):
జనవరి 5,జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ లో ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన ఆన్లైన్ లో అప్లికేషన్లు నింపడం జరిగింది.ఈ కార్యక్రమంలో నరేంద్ర మోడీ 18 చేతి వృత్తి కులాల వారికి వందల కోట్లు బడ్జెట్ కేటాయించడం జరిగింది. అందువలన ప్రతి ఒక్కరు ఆన్లైన్ లో అప్లికేషన్లు నింపి రుణాలు పొందాలని బిజెపి నాయకులు ఆదినారాయణ అందరికి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఒక లక్ష నుండి మూడు లక్షలు వరకు ప్రభుత్వం రుణాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. మిగతా రెండు లక్షలు తదుపరి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ విధంగా అప్లై చేసుకున్న వారికి ట్రైనింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేసి దానిలో అందరికీ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఒక్కరికి ఒకరోజు స్టైపండు స్టైపండుగా 500 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని, తర్వాత ఒక ఐడి కార్డు ఒక సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని ఆదినారాయణ తెలిపారు.తర్వాత బ్యాంకు నుండి లోన్ మంజూరు అవుతుందని,ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జూబ్లీహిల్స్ డివిజన్ ప్రజల్ని కోరారు.ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రభుదాస్,మల్లీ గౌడ్ మరియు బస్తీవాసులు పాల్గొన్నారు.

# సెలూన్ ధోబి గాట్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు కొనసాగించాలని

## అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్..



ప్రజావినికిడి,(హైదరాబాద్):సెలూన్ లకు దోబీ ఘాట్లకు ఉచితవిద్యుత్ కొనసాగించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.ఈ సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రాసమల్ల బాలకృష్ణ నాయి బ్రాహ్మణ సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.రజకులు నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని వారిని అన్ని రకాలుగా ఆదుకుంటామని మంత్రి చెప్పడం జరిగిందని తెలిపారు. 2021 - 2022 నుండి సెల్లులకు దోబిగాట్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తున్నారు.ఈ పథకం ద్వారా రజకులు 76,060 మందికి నాయి బ్రాహ్మణులకు 36,526 మంది లబ్ధి పొందుతున్నారు.గత నాలుగు నెలల నుండి బకాయి పడ్డ బిల్లులు దోబీ గాట్లకు రూ 78.55 కోట్లు సెలూన్లకు రూ 12.34 కోట్లు విద్యుత్ బిల్లులను విడుదల చేయాల్సిందిగా ఆర్థిక శాఖకు మంత్రి విజ్ఞప్తి చేశారని బాలకృష్ణ పేర్కొన్నారు.ఉచిత విద్యుత్తు పథకాన్ని యధాతథంగా కొనసాగిస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ కి నాయి బ్రాహ్మణ రాష్ట్ర సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# 4వ రోజు ప్రవచన సప్తాహం..



ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
వనస్థలిపురం భక్త సమాజం వారు శ్రీ నివాసపురం కాలని సంక్షేమ సంఘ సహాయ సహకారంతో,శ్రీ నివాసపురం రోడ్డు నెంబర్ -2, వున్న లైబ్రరీ భవన ప్రాంగణములో శుక్రవారం రోజు అనగా 5.1.2024 బుధవారం సా.6.30గం.లకు ప్రవచన సప్తాహం జ్యోతి ప్రజ్వలన తో ప్రారంబ మైనది.ఈ కార్యక్రమంలో పండితు లు ఎల్ జైపాల్ రెడ్డి,జె లక్ష్మయ్య శ్రీ సి.హేచ్.వి ఆర్కే మూర్తి సుగ్గు రాములు వద్దిరాజు జనార్దనరావు మరియు శ్రీనివాస పురం కాలని మహిళా భక్తులు తదితరులు పాల్గోని జ్యోతి ప్రజ్వలన కావించిరి.మరి శుక్రవారం రోజు ప్రవచన కర్త శ్రీ వేముల రాజేశ్వరరావు చె "వానరరాజ్యం" ప్రవచనం ద్వారా, 4వ రోజు ప్రవచన సప్తాహం ప్రారంబించడమైనది.
సి.హేచ్ వి ఆర్కే మూర్తి.

# ఆర్కేపురం భాష్యం పాఠశాలలో ఘనంగా 13వ వార్షికోత్సవ వేడుకలు..















ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
సరూర్ నగర్ మండలం భాష్యం స్కూల్ ఆర్కేపురం శాఖలో విద్యార్థినీ విద్యార్థుల హంగామా..
గురువారం రోజున వనస్థలిపురంలోని పల్లవి గార్డెన్స్ లో జరిగిన ఆర్కే పురం శాఖ పాఠశాల 13వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ ఇస్రో సైంటిస్ట్ ఈ శివకుమార్ హాజరయ్యారు.
గౌరవ అతిథిగా ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మెజీషియన్ ఇంద్ర జాలికుడు రామ్ ఆఖర్ జ్యోతి ప్రజ్వలన చేశారు.జె డి ఓ అంకమ్మ రావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్ప రావు,లిటిల్ ఛాన్స్ ప్రిన్సిపల్ అనుపమ అలాగే విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు. సాంప్రదాయ నృత్యాలతో మొదలైన ఈ ప్రదర్శన లో చిన్నపిల్లల నృత్యాలు చూపరులను అలరించగా శివ తాండవ నృత్యం అందరిని భక్తి పారవశ్యంలోకి తీసుకెళ్లింది. రాధాకృష్ణుల బృంద నాట్యాలు పిరమిడ్ విన్యాసాలు కరాటే విన్యాసాలు చూపరులకు ముచ్చట గొలిపేలా కొనసాగాయిముఖ్య అతిథి శంకర్ మాట్లాడుతూ, చంద్రాయన్ 2 గురించిచెప్పి విద్యార్థులను అది ఆదర్శంగా చేసుకోవాలని ఒక ఇస్రో సైన్టిట్ గా తన అనుభవాలను పంచుకున్నారు.ఇంకా రామ్ అఖిల్ విద్యార్థులు ప్రస్తుతం మొబైల్ కి దూరంగా ఉండాలని చెబుతూ ఇంద్రజారి విద్యతో అందరిని అబ్బురపరిచారు.2ఈ ఓ అంకమ్మరావు విద్యార్థులు చదువుల్లోబాగా రాణించాలని పాఠశాల పురోగతిని ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పారావు మాట్లాడుతూ,ఐఐటి విద్యా విధానం గురించి వివరిస్తూ,విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రోత్సహించారు.అటిల్ చమ్స్ ప్రిన్సిపల్ అనుపమ మేడం విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతోనే ఏదైనా ప్రగతి సాధ్యమని ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" - రూ.77 లక్షలతో పాఠశాల భవన ప్రారంభోత్సవం..
- హాజరైన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, జడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి..





ప్రజావినికిడి,(షాద్ నగర్):
విద్యాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు చేయూతగా నాణ్యమైన చదువులు బోధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం నియోజక వర్గంలోని కేశంపేట మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల (ఎంపీపీఎస్)భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి, కొత్తూరు మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి జడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు ఈ సందర్భంగా పాఠశాల భవనాన్ని లాంఛనంగా ఎమ్మెల్యే శంకర్



ప్రారంభించారు. అనంతరం చిన్నారి విద్యార్థినీ విద్యార్థులతో పాఠశాల అధ్యాపక బృందంతో ఆయన కాసేపు మాట్లాడారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని చర్యలు చేపడుతుందని ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. మన ఊరు మనబడి పథకం కింద 52 లక్షల 82 వేల రూపాయలు ఈ భవన నిర్మాణానికి మంజూరయ్యాయని, అదేవిధంగా మరికొన్ని ఎన్ఆర్ జీఎస్ నిధులతో మొత్తం 77 లక్షల వ్యయంతో ఈ పాఠశాల భవనాన్ని ప్రభుత్వం నిర్మించినట్లు ఎమ్మెల్యే చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్ మరియు వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# మొబైల్ క్రీడలు మానండి.

- శారీరక మానసిక దృఢత్వం కోసం క్రీడలు ఆడండి.
- షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ,మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నవీన్ రెడ్డి..





ప్రజావినికిడి,(షాద్ నగర్):
క్రీడలు మానసిక శారీరక దృఢత్వానికి తోడ్పడుతాయనీ వాటిని శారీరక శ్రమతో ఆడాలే తప్ప మొబైల్ ఫోన్లో ఆడడం సరికాదని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. నియోజక వర్గంలోని చౌదర్ గూడ మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో సర్పంచ్ భూపాల చారి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటును బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్,మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నవీన్ రెడ్డి నవీన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్,జడ్పీ వైస్ చైర్మన్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో క్రీడలను ప్రోత్సహించడం వల్ల నైపుణ్యమైన క్రీడాకారులను గుర్తించడం జరుగుతుందని అన్నారు.వారికి తగిన సౌకర్యాలు కల్పించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం ద్వారా గ్రామాల్లో యువత ప్రోత్సహించబడతారనీ అదే విధంగా క్రీడల ద్వారా స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడతాయనీ అంతే కాకుండా క్రీడల ద్వారా మానసిక శరీరపరమైన



దృఢత్వం ఏర్పడుతుందనీ, తద్వారా చదువుల్లో కానీ ఏ రంగాల్లో పనిచేయడానికి అయినా ఉల్లాస ఉత్సాహం ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా పెద్ద ఎల్కిచర్ల సర్పంచ్ భూపాలచారి మాట్లాడుతూ,క్రీడలు మానసిక శరీరక ఆరోగ్యానికి తోడ్పడుతాయని మంచి స్నేహపూర్వకమైన సంబంధాలు మెరుగుపడతాయి ఆనాటి కాలంలో శరీరక క్రీడలు ఎక్కువగా ఆడేవారనీ తద్వారా మనుషులు దృఢంగా ఉండి తమ తమ పనులను యాక్టివ్ గా చేసుకునేవారని అన్నారు.కానీ ఇప్పటి కాలంలో ఎవరిని చూసినా మొబైల్ లో మునిగిపోయి క్రీడలు కూడా మొబైల్ లోనే ఆడడం జరుగుతుందని అన్నారు. తద్వారా మానసిక రుగ్మతలు చిన్న సమస్యలు వచ్చినా ఆ తట్టుకోలేని స్థితికి వెళ్లి ఆత్మహత్యలకు దారితీస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రావుల మంగమ్మ సర్పంచ్ భూపాల చారి మాజీ సర్పంచ్ గౌస్ కొందుర్గు బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి జిల్లెడు చౌదరిగుడా బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు ఆఫీస్ జబ్బర్ జిల్లెడు సర్పంచ్ బాబురావు ఘనపూర్ సర్పంచ్ శివ గుట్ట రాజు,మామిడిపల్లి ఎంపిటిసి కట్న మాదవి రవీందర్,శివ చారి,ఆర్ చెన్నయ్య ఆర్ యాదయ్య బి. రామచంద్రయ్య ఆర్గనైజర్,ఎస్.డి గౌస్, కనక అంజి కనక శేఖర్, బోలా సత్యం,రవి, బోయ యాదయ్య, రావుల శ్రీకాంత్, రావుల శ్రీనివాస్ బియా శివ గ్రామస్తులు ఎర్ర రత్నయ్య ఎర్ర భీమయ్య సల్మాన్ కుమార్ నాగయ్య భీమ్ రాజ్ కే.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బ్యాటరీ సెల్స్‌కు ఇస్రో టెస్టు

**జనవరి 5 ప్రజావినికిడి,:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఏర్పాటు ప్రక్రియలో ఉన్న ఇస్రో ఈ దిశలో మరో ముందడుగుకు వెళ్లింది. తాము సరికొత్త బ్యాటరీ సెల్స్ అత్యున్నత సామర్థ్యాన్ని పరీక్షించినట్లు ఇస్రో అధికారులు శుక్రవారం తెలిపారు. ఇప్పుడు లభించే బ్యాటరీ సెల్స్‌తో పోలిస్తే వీటి పనితీరు మిన్న అని, పైగా చవక అని కూడా తెలిపారు. ఇస్రో రూపొందించి , వాడక అర్హత దక్కించుకున్న 10 ఎహెచ్ సిలికాన్



గ్రాఫైట్ అనోడేకు చెందిన లై ఐయాన్ సెల్స్ పనితీరు పరీక్ష తరువాత ఫలితాలు బాగున్నాయని నిర్ధారించారు. ఇవి తక్కువ బరువుతో ఉండటం, తక్కువ ధరకు అందుబాటులో ఉండటం ప్రత్యేకతలుగా నిలిచాయి. ఇటీవల పిఎస్ఎల్వి సి 58 రాకెట్ ద్వారా జరిపిన ప్రయోగం దశలోనూ ఈ బ్యాటరీ సెల్స్ సమర్థతను పరీక్షించారు. ఇప్పుడు విడిగా వీటి నాణ్యత పట్ల జరిపిన పరీక్ష వీటి మన్నికను నిర్ధారించింది.

# లోక్ సభ సన్నాక సమావేశం..







**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
లోక్‌సభ ఎన్నికల సన్నాహాక సమావేశాల్లో భాగంగా తెలంగాణ భవన్ లో శుక్రవారం రోజు ప్రారంభమైన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ప్రతినిధులతో సమావేశం.
ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీష్ రావు,సబితా ఇంద్రారెడ్డి,మహేందర్ రెడ్డి,సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,కడియం శ్రీహరి, మాజీ స్పీకర్ మధుసూధనా చారి, ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి,బీఆర్ఎస్ జనరల్ సెక్రెటరీ కే.కేశవరావు, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ,టి.ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి,చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు,మాజీ చైర్మన్లు,మేయర్లు, మాజీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, మాజీ చైర్మన్లు,వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు,జిల్లా పార్టీ అధ్యక్షులు,పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై దర్యాప్తును సీబీఐకి ఇవ్వొద్దు

## : రేవంత్ రెడ్డికి తమ్మినేని వీరభద్రం లేఖ


**జనవరి 5 ప్రజావినికిడి,:**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా కొనసాగిన సంగతి తెలిసిందే. సమావేశాల సందర్భంగా పలు రంగాలపై శ్వేతపత్రాలను విడుదల చేసిన రేవంత్ ప్రభుత్వం... గత కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేసింది. విద్యుత్ రంగంలో మూడు అంశాలపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశిస్తున్నట్టు శాసనసభ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మరోవైపు, సాగునీటి ప్రాజెక్టుల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ప్రభుత్వం ఆరోపిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. తాజాగా, రేవంత్ రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కీలక విన్నపం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై దర్యాప్తును సీబీఐకి అప్పగించవద్దని తమ్మినేని కోరారు. ఈ మేరకు ఆయన రేవంత్ కు లేఖ రాశారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర సంస్థలు కేంద్రం చేతిలో పావులా మారాయని లేఖలో తమ్మినేని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, దర్యాప్తును సీబీఐకి అప్పగించకుండా... సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపిస్తే మేలని సూచించారు. దీంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన కొన్ని గణాంకాలను కూడా లేఖలో ప్రస్తావించారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇప్పటి వరకు రూ. 93 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఇందులో బ్యాంకుల ద్వారా రూ. 87,449 కోట్లు మంజూరు కాగా... రూ. 71,565.69 కోట్లు విడుదలయ్యాయని, ఈ మొత్తాన్ని ఖర్చు చేసేశారని తెలిపారు.

# త్వరలో పట్టాలెక్కనున్న మౌలాలి-హైటెక్ సిటీ ఎంఎంటీఎస్

**జనవరి 5 ప్రజావినికిడి,:**



నగరవాసులకు ఓ గుడ్ న్యూస్. త్వరలో మౌలాలి-హైటెక్ సిటీ ఎంఎంటీఎస్ రైలు పట్టాలెక్కనుంది. ఫిబ్రవరిలోపే ఈ రైళ్లు నడిచే అవకాశం ఉంది. ఎంఎంటీఎస్ రెండో దశ పనుల్లో భాగంగా చేపట్టిన మౌలాలి-సనత్‌నగర్ మధ్య నిర్మిస్తున్న రెండో లైను పనులు పూర్తయ్యాయి. దీంతో, మౌలాలి నుంచి నేరుగా హైటెక్ సిటీ మీదుగా లింగంపల్లికి ఎంఎంటీఎస్ రైళ్లు నడిపేందుకు అవకాశం లభించింది.
మౌలాలి-సనత్‌నగర్ మధ్య మొత్తం 22 కిలోమీటర్ల పరిధిలో మరో ఆరు స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో, ఆయా ప్రాంతాల వారు కేవలం 30 నిమిషాల్లోనే ఐటీ సంస్థలు ఉండే ప్రాంతాలకు చేరుకునే అకాశం ఉంటుంది.
మాల్కాజిగిరి నియోజకవర్గంలో 25 వేల నుంచి 30 వేల మంది వరకూ ఐటీ ఉద్యోగులు ఉంటారని కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బీటీ శ్రీనివాస్ చెప్పారు. ప్రస్తుతం అక్కడి వారు ఐటీ కారిడార్‌కు రావాలంటే నేరేడ్‌మెట్, ఆర్‌కేపుర వంతెన, కంటోన్మెంట్, బేగంపేట మీదుగా సొంత వాహనాల్లో ప్రయాణిస్తు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు ఇక సనత్‌నగర్, పీర్జాదీగూడ, సుచిత్ర సెంటర్, భూదేవినగర్, అమ్ముగూడ, నేరేడ్‌మెట్, హౌసింగ్‌బోర్డు కాలనీ స్టేషన్ల నుంచి ఎంఎంటీఎస్ పరుగులు పెట్టనుండటంతో ఆయా ప్రాంతాల వారి ప్రయాణ కష్టాలు తీరనున్నాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613


ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# పీఠం కోసం యాత్ర రూటు మారింది

## మార్పు వెనుక వ్యూహం ఇదే!

యూపీలో రాహుల్ గాంధీ న్యాయ యాత్ర కోసం కాంగ్రెస్ రూపొందించిన రూట్ వెనుక రాజకీయ ఉద్దేశ్యం దాగి ఉంది. రాహుల్ గాంధీ యాత్రా మార్గంలోని 23 నియోజకవర్గాల్లో కనీసం వీలైనన్ని ఎక్కువ సీట్లలో కాంగ్రెస్ బరిలోకి దిగాలని భావిస్తోంది. తన మొదటి దశ భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ పశ్చిమ యూపీలోని మూడు జిల్లాలను మాత్రమే కవర్ చేయగలిగారు. కానీ ఈసారి ఆయన 20 జిల్లాల మీదుగా ప్రయాణం సాగిస్తున్నందున, పూర్వాంచల్ నుండి అవధ్, రోహిల్‌ఖండ్ మీదుగా పశ్చిమ యూపీ, బ్రిజ్ ప్రాంతం వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కవర్ చేసినట్టవుతుంది.



**జనవరి 5 ప్రజావినికిడి,:**

'భారత్ జోడో' యాత్ర ఇచ్చిన స్ఫూర్తి, ఉత్సాహంతో రాహుల్ గాంధీ యాత్ర 2.0ను జనవరి 14న ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు. భారతదేశంలోని దక్షిణ దిక్కున చిట్టచివర్లో ఉన్న కన్యాకుమారి నుంచి ఉత్తరాన ఉన్న కాశ్మీర్ (శ్రీనగర్) వరకు సాగించిన మొదటి యాత్రకు 'భారత్ జోడో' అని పేరు పెట్టగా..దేశంలోని తూర్పున ఉన్న మణిపూర్ నుంచి పశ్చిమ దిక్కున ఉన్న ముంబై (మహారాష్ట్ర)కు చేపట్టదల్చిన యాత్ర 2.0కు తొలుత 'భారత్ న్యాయ్' యాత్రగా నామకరణం చేశారు. అదే సమయంలో మొదట అనుకున్న మేరకు 14 రాష్ట్రాల మీదుగా 6,200 కి.మీ దూరం యాత్ర చేపట్టాల్సి ఉండగా.. చివరి నిమిషంలో యాత్రలో మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి.

'భారత్ న్యాయ్' యాత్ర పేరుతో వాహనాల శ్రేణికి స్టిక్కర్లు కూడా అతికించిన తర్వాత పేరును "భారత్ జోడో న్యాయ్ యాత్ర"గా మార్చారు. అలాగే ఇదివరకు యాత్ర మార్గంలో లేని అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాన్ని చేర్చడంతో పాటు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో మరింత దూరం యాత్ర సాగించేలా వ్యూహాత్మకంగా మార్పులు చేశారు. ముందుగా అనుకున్న ప్రణాళిక కంటే భిన్నంగా తీసుకువచ్చిన ఈ మార్పుల వెనుక పెద్ద వ్యూహమే దాగి ఉందని తెలుస్తోంది.ఢిల్లీ పీఠాన్ని అధిరోహించాలంటే ముందు ఉత్తర్ ప్రదేశ్ గెలుపొందాలి అన్నది భారత రాజకీయాల్లో ఉన్న నానుడి. దానర్థం కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే దేశంలోనే అత్యధిక ఎంపీ సీట్లు (80) ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లో పాగా వేయకుండా సాధ్యపడదు అని. ఈ రాష్ట్రంలో 2019లో తాను పోటీ చేసిన అమేథీలోనే రాహుల్ గాంధీ ఓడిపోయారు. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు యూపీలోని 20 జిల్లాల్లో 23 నియోజకవర్గాలను కవర్ చేస్తూ యాత్ర సాగించేలా రూట్ మ్యాప్‌ను మార్చారు. తద్వారా తమకు పట్టున్న రాయ్‌బరేలీ, అమేథీతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో బలం పెంచుకోవాలని చూస్తున్నారు.మారిన రూట్ మ్యాప్ ప్రకారం మణిపూర్ రాజధాని ఇంఫాల్ నుంచి ముంబై వరకు మొత్తం 6,713 కిలోమీటర్ల దూరాన్ని రాహుల్ గాంధీ 66-68 రోజుల్లో పూర్తి చేయనున్నారు. పాత లెక్క ప్రకారం 14 రాష్ట్రాల్లో 6,200 కి.మీ దూరం ప్రయాణించాల్సి ఉండగా.. అదనంగా మరో 513 కి.మీ దూరం పెరిగింది. కొత్త రూట్ ప్రకారం ఆయన 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాల్లోని 100 లోక్‌సభ స్థానాల్లో యాత్ర సాగించనున్నారు. కొత్తగా చేసిన మార్పుల్లో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం కూడా చేరింది. యాత్ర వివరాలను వెల్లడించిన ఏఐసీసీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' రూట్ మ్యాప్‌లో రాహుల్ గాంధీ ఎక్కువ సమయం ఉత్తరప్రదేశ్‌లో గడపనున్నట్టు వెల్లడించింది. ఈ రాష్ట్రంలో రాహుల్ గాంధీ 11 రోజుల్లో 1,074 కిలోమీటర్లు ప్రయాణించనున్నారు.

చందౌలీ వద్ద ఉత్తర ప్రదేశ్‌లోకి ప్రవేశించి ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గం వారణాసి మీదుగా అమేథీ, రాయ్ బరేలీ చేరుకుంటారు. యూపీలో రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ యాత్ర' కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతుందని, వారు ఐక్యంగా రంగంలోకి దిగుతారని ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ రాష్ట్రంలోని హై ప్రొఫైల్ లోక్‌సభ నియోజకవర్గాల మీదుగా ప్రయాణం సాగిస్తారు. సోనియా గాంధీ ప్రాతినిథ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఎంపీగా ఉన్న ఆయన పాత సీటు అమేథీలో కూడా యాత్ర సాగిస్తారు. మొత్తంగా యూపీలోని చందౌలీ, వారణాసి, భదోహి, అలహాబాద్, ప్రతాప్‌గఢ్, అమేథీ, రాయ్ బరేలీ, లక్నో, సీతాపూర్, లఖింపూర్, షాజహాన్‌పూర్, బరేలీ, రాంపూర్, మొరాదాబాద్, మీరట్, అలీగఢ్, మథుర, ఇటా, కాస్‌గంజ్, ఆగ్రా మీదుగా యాత్ర సాగనుంది.

2009 ఎన్నికల్లో గెలిచిన సీట్లు కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల సీట్లను కాంగ్రెస్ ఎంపిక చేసింది. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర వెళ్లే ప్రాంతాల్లో వారణాసి, ఫుల్‌పూర్, ప్రయాగ్‌రాజ్, ప్రతాప్‌గఢ్, అమేథీ, రాయ్ బరేలీ, లక్నో, లఖింపూర్ ఖేరీ, షాజహాన్‌పూర్, బరేలీ, మొరాదాబాద్, మీరట్, అలీగఢ్, ఫతేపూర్ సిక్రీ, ఆగ్రా నియోజకవర్గాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో ఈ స్థానాల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ యోచిస్తోంది. వీటితో పాటు యాత్ర మార్గంలో లేని మరికొన్ని నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పోటీ చేయాలని చూస్తోంది. 2009లో యూపీలో లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్, సోనియాతో పాటు మొత్తం కాంగ్రెస్ ఏడు స్థానాల్లో విజయం సాధించింది. 2014, 2019లో యూపీలో కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆయన తల్లి సోనియా గాంధీ ఎంపీగా ఉన్న రాయ్‌బరేలీ సీటుపై మాత్రమే కాంగ్రెస్ తన పట్టును కొనసాగిస్తోంది. రాహుల్ గాంధీ 2019లో తన సాంప్రదాయ స్థానమైన అమేఠీలో ఓడిపోయారు. రాహుల్ గాంధీ తన 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో వెళుతున్న లోక్‌సభ స్థానాల్లో రెండు సీట్లు మినహా మిగిలినవన్నీ బీజేపీ గెలుపొందింది.

2014లో యూపీలోని 80 లోక్‌సభ స్థానాలకు గాను బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 73 సీట్లు గెలుచుకోగా, 2019లో 64 సీట్లు గెలుచుకుంది. 2024లో బీజేపీని క్లీన్ స్వీప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, యూపీలోనే బీజేపీని ఓడించాలని విపక్షాలు ప్లాన్ వేసి మోదీ హ్యాట్రిక్ సాధించకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయి. యూపీలో సమాజ్‌వాదీ, కాంగ్రెస్, ఆర్ఎల్డీ విపక్ష కూటమి (%×.చీ.ఐ.×.గా%)లో భాగంగా ఉన్నాయి. ఇప్పుడు రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా యూపీలోనే ఎక్కువ కాలం గడుపుతారు. బీజేపీకి వ్యతిరేకంగా రాజకీయ వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు.


భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొనేందుకు విపక్ష కూటమి భారత మిత్రపక్షాలను కూడా ఆహ్వానించాలని కాంగ్రెస్ వ్యూహం రచించింది. భారత్ జోడో న్యాయ యాత్ర కోసం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగే యాత్రలో పాల్గొనేందుకు కాంగ్రెస్‌తో పొత్తు ఉన్న పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక సంఘాలను ఆహ్వానిస్తామని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ తెలిపారు. యాత్ర భారత రాజకీయాల్లో పరివర్తన ఉద్యమంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

2024 లోక్‌సభ ఎన్నికల సంసిద్ధతతో పాటు భారత్ జోడో న్యాయ యాత్ర కోసం కాంగ్రెస్ గురువారం కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు కష్టపడి లోక్‌సభ ఎన్నికల్లో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ ఎక్కడ బలహీనంగా ఉందో అక్కడ ప్రజాదరణ కలిగిన నేతలను గుర్తించాలని నిర్ణయించింది. షెడ్యూల్డ్ కులం (%బాజ%), షెడ్యూల్డ్ తెగ (%బా%), ఇతర వెనుకబడిన తరగతులు (%బాదీజ%), మైనారిటీ ఆధిపత్య స్థానాల్లో నాయకత్వాన్ని తయారు చేయాలని కూడా నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించకుండా చూడాలని ఆయన నేతలను కోరారు.

కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియా పదవీకాలం గురించి మల్లికార్జున్ ఖర్గే ప్రత్యేకంగా ప్రస్తావించారు. మార్చి 2001లో బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఎన్డీయేను అధికారం నుంచి దించాలని పార్టీ తీర్మానించిందని గుర్తుచేశారు. అన్నట్టుగానే 2004లో సోనియా నాయకత్వంలో ప్రతి రాష్ట్రంలో కార్యకర్తలు హృదయపూర్వకంగా నిరంతరం పనిచేశారన్నారు. యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (%ఖూూా%) నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (%చీణూూ%)ని ఓడించి 10 సంవత్సరాలు అధికారంలో ఉంది. ఈ పదేళ్లలో పార్టీ కార్యకర్తలు ప్రతి గ్రామం, నగరం నుంచి తయారయ్యారు. ఇప్పుడు పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు అదే అంకితభావంతో పని చేయాల్సిన సమయం ఆసన్నమైంది అంటూ ఖర్గే పిలుపునిచ్చారు. 2024లో మోడీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని వ్యాఖ్యానించారు.

### యూపీ ఎందుకు కీలకం?

దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు యూపీలో ఉన్నాయి. ఎన్నికలు జరిగే 543 సీట్లలో యూపీలో ఏకంగా 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇవి మొత్తం సీట్లలో 15 శాతం. అంతేకాదు, ఎక్కువ మంది ప్రధాన మంత్రులను అందించిన రాష్ట్రంగానూ ఉత్తర్‌ప్రదేశ్‌కు రికార్డు ఉంది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, వీపీ సింగ్, చంద్రశేఖర్, అటల్ బిహారీ వాజ్‌పేయి వరకు అందరూ యూపీ నుంచే ఎంపీలయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా యూపీలోని వారణాసి స్థానం నుంచి ఎంపీగా ఉన్నారు. బీజేపీ వరుసగా రెండు సార్లు అధికారంలోకి రావడంలో యూపీలో సాధించిన సీట్లు కీలకంగా మారాయి.



Graphic: Ritesh Kumar

---

## అయోధ్య రామయ్య కోసం తిరుమల వెంకన్న కానుకగా లక్ష లడ్డూలు

- అయోధ్యలో తుది మెరుగులు దిద్దుకుంటున్న రామ మందిరం
- జనవరి 22న ప్రాణ ప్రతిష్ట
- అయోధ్యకు భారీ కానుక పంపుతున్న టీటీడీ
- ఒక్కో లడ్డూ బరువు 25 గ్రాములు ఉంటుందన్న ఈవో ధర్మారెడ్డి



**జనవరి 5 ప్రజావినికిడి,:**
అయోధ్యలో జనవరి 22న అత్యంత ప్రతిష్ఠాత్మక రీతిలో రామ మందిరం ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరగనుంది. అందుకోసం, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అయోధ్యకు విశిష్టమైన కానుక పంపుతోంది. అయోధ్య రాముడి కోసం తిరుమల నుంచి లక్ష లడ్డూలు పంపనున్నారు. ఈ మేరకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు. అయోధ్య పంపించే లడ్డూలు ఒక్కొక్కటి 25 గ్రాముల బరువు ఉంటాయని తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్ లో ఇవాళ 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ, సనానత హైందవ ధర్మ అభివృద్ధికి టీటీడీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సనాతన హైందవ ధర్మ ప్రచారంలో భాగంగా తిరుమలలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సదస్సుకు దేశంలోని ప్రముఖ ధార్మిక సంస్థల ప్రతినిధులు, పీఠాధిపతులు, మఠాధిపతులు హాజరవుతారని ధర్మారెడ్డి వివరించారు. ఇక, ధనుర్మాస కార్యక్రమాల ముగింపు నేపథ్యంలో, జనవరి 15న తిరుపతిలోని టీటీడీ కార్యాలయం వద్ద శ్రీ గోదా కల్యాణం నిర్వహిస్తున్నామని... జనవరి 16న కనుమ పండుగను పురస్కరించుకుని స్వామివారి పార్వేట ఉత్సవం జరుపుతున్నామని తెలిపారు.

## మొత్తానికి మూత్రం పచ్చగా ఉండడానికి కారణం తెలిసింది!

**మూత్రం పచ్చగా ఉండడానికి యూరోబిలిన్ అనే ఎంజైమే కారణం**

**ఎర్ర రక్త కణాలు విచ్ఛిన్నమైన తర్వాత బిలిరుబిన్ అనే నారింజ రంగు ద్రవం విడుదల**

**ఆ తర్వాత యూరోబిలిన్‌గా మారి మూత్రం ద్వారా బయటకు**

**మేరీల్యాండ్ యూనివర్సిటీ పరిశోధనలో వెల్లడి**



**జనవరి 5 ప్రజావినికిడి,:**
కాస్తంత వేడిచేస్తే మూత్రం పచ్చగా వస్తుంది. ఇలా రావడానికి శరీరంలో తగినంత నీరు లేకపోవడమే (డీ హైడ్రేషన్) కారణమని వైద్యులు చెబుతూ ఉంటారు తప్ప అందుకు గల కచ్చితమైన కారణం మాత్రం చెప్పరు. మూత్రం పసుపు పచ్చగా ఉండడానికి యూరోబిలిన్ అనే ఎంజైము కారణమని 125 ఏళ్ల క్రితమే నిపుణులు గుర్తించినప్పటికీ అది ఎక్కడి నుంచి విడుదలవుతుందన్న విషయంలో ఇప్పటి వరకు స్పష్టత లేదు.
అయితే, ఇప్పుడీ గుట్టు వీడిపోయింది. అమెరికాలోని మేరీల్యాండ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనలో మూత్రం పచ్చగా ఉండడానికి గల అసలు కారణాన్ని గుర్తించారు. మూత్రం రంగుకు, ఎర్ర రక్త కణాలకు సంబంధం ఉందని తేల్చారు. ఎర్ర రక్తకణాలు విచ్ఛిన్నమైన తర్వాత బిలిరుబిన్ అనే నారింజ రంగులో ఉండే ద్రవాన్ని విడుదల చేస్తాయి. ఇది జీర్ణాశయానికి చేరుకున్న తర్వాత ఉపయోగకరమైన బ్యాక్టీరియా దానిని వివిధ అణువులుగా మార్చుతుంది. ఈ క్రమంలో యూరోబిలినోజెన్ అనే రంగులేని ఉప ఉత్పత్తి తయారవుతుంది. ఆ తర్వాత అది క్రమంగా పసుపు రంగులో ఉండే యూరోబిలిన్‌గా మారి మూత్రం ద్వారా బయటకు వస్తుందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన అధ్యయన వివరాలు 'నేచర్ మైక్రోబయాలజీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## ఇండియా సంపన్నుడిగా మరోమారు గౌతం అదానీ.. ముకేశ్ అంబానీ వెనక్కి!

- నివేదిక విడుదల చేసిన బ్లూమ్‌బర్గ్
- ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 12వ స్థానంలో అదానీ, 13లో అంబానీ
- గతేడాదితో పోలిస్తే మెరుగైన ర్యాంకింగ్స్



**జనవరి 5 ప్రజావినికిడి,:**
అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్‌పర్సన్ గౌతం అదానీ మరోమారు భారతదేశంలోనే అత్యంత సంపన్నుడిగా రికార్డుల్లోకి ఎక్కారు. ఈ క్రమంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీని అధిగమించారు. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ (బీబీఐ) నివేదిక పేర్కొంది. మరోవైపు, ప్రపంచ కుబేరుల జాబితాలో అదానీ టాప్-12లో చోటు సంపాదించుకోగా, అదానీ ఒక్క స్థానం దిగువన 13లో ఉన్నారు. గతేడాదితో పోలిస్తే వీరి స్థానాలు ఈసారి మెరుగయ్యాయి.



# శ్రీవారి చెంత చీర కట్టులో జాన్వీ కపూర్



అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ రెగ్యులర్ గా తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం జరుగుతూ ఉంటుంది. తన తల్లి బతికి ఉన్నప్పటి నుంచి కూడా రెగ్యులర్ గా శ్రీవారి దర్శనం కి వచ్చే జాన్వీ తన తల్లి లేకున్నా కూడా స్నేహితులతో లేదా ఇతర కుటుంబ సభ్యులతో శ్రీవారి చెంతకు వస్తుంది. ప్రతి సంవత్సరం ఆరంభంలో కచ్చితంగా జాన్వీ కపూర్ తిరుమల వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం జరుగుతుంది. అందులో భాగంగానే ఈసారి జాన్వీ కపూర్ నేడు తిరుమలకు వచ్చి కాలి నడకన పైకి ఎక్కి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుంది. దర్శనం తర్వాత గోవిందా గోవిందా అంటూ తెలుగు లో రాసి ఇన్ స్టా లో ఈ అందమైన ఫోటోలను షేర్ చేసింది. అందాల జాన్వీ కపూర్ ఫోటోలు ఎప్పుడు కూడా సోషల్ మీడియా ద్వారా వైరల్ అవుతూ ఉంటాయి. ఇప్పుడు తిరుమలలో ఉన్న జాన్వీ ఫోటోలు వైరల్ అయ్యాయి. చీర కట్టులో జాన్వీ కపూర్ చాలా అందంగా కనిపిస్తోంది. ఈ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ అందం టాలీవుడ్ లో ఎన్టీఆర్ కు జోడీగా దేవర సినిమా తో ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా ఈ అమ్మడి మొదటి

# సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్న రవితేజ 'ఈగల్'




సంక్రాంతి పండుగ అంటే తెలుగువాళ్లకు ఎంత ప్రత్యేకమో చెప్పనక్కర్లేదు. కొత్త బట్టలు, కోడిపందాలు, పిండివంటలు, కొత్త సినిమాలు... ఇలా చెప్పుకుంటూ పోతే సంక్రాంతి పండుగ విశేషాలు చాలానే ఉంటాయి. సినీ రంగానికి కూడా సంక్రాంతి ఒక సెంటిమెంట్ గా మారిపోయింది. ఈ పండుగకు తమ సినిమాలు విడుదల చేయాలని ప్రతి ఒక్క హీరో, దర్శకుడు, నిర్మాత భావిస్తారంటే అతిశయోక్తి కాదు. ఈసారి కూడా సంక్రాంతి బరిలో పలువురు అగ్రహీరోల సినిమాలు ఉన్నాయి. అయితే, డేట్స్ క్లాష్ రావడంతో మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఈగల్' చిత్రం సంక్రాంతి రేసు నుంచి తప్పుకుంది. ఈ చిత్ర నిర్మాతలు విడుదల తేదీని వాయిదా వేసుకున్నారు. వాస్తవానికి ఈగల్ చిత్రం జనవరి 13న రిలీజ్ కావాల్సి ఉంది. అదే రోజున విక్టరీ వెంకటేశ్ సైంధవ్ రిలీజ్ అవుతోంది. సూపర్ స్టార్ మహేశ్ బాబు గుంటూరు కారం జనవరి 12న వస్తుండగా... అదే రోజున తేజా సజ్జా నటించిన హను-మాన్ విడుదలవుతోంది. నాగార్జున నటించిన నా సామిరంగ చిత్రం జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో, ఇవాళ తెలుగు ఫిలిం చాంబర్, తెలంగాణ ఫిలిం చాంబర్, తెలుగు నిర్మాతల మండలి సమావేశమై సినిమాల విడుదల తేదీలపై చర్చించాయి. వెంటవెంటనే పెద్ద సినిమాలు రిలీజ్ అయితే, ఎలాంటి పరిస్థితులు ఏర్పడతాయన్నది ప్రముఖంగా చర్చకు వచ్చింది. ఈ సమావేశంలో దిల్ రాజు, దామోదర ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ క్రమంలో, తమ చిత్రాన్ని వాయిదా వేసుకునేందుకు ఈగల్ చిత్ర నిర్మాతలు అంగీకరించారు. ఈగల్ చిత్రాన్ని ఫిబ్రవరి 9న రిలీజ్ చేసేందుకు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్ణయించుకుంది. దిల్ రాజు దీనిపై స్పందిస్తూ... ఒక సినిమా వెనక్కి తగ్గినంత మాత్రాన ఏదో జరిగినట్టు భావించరాదని, ఇది తామందరం కలిసి తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేశారు. దామోదర ప్రసాద్ స్పందిస్తూ, ఈగల్ చిత్ర నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# చందమామ కథలా మెగాస్టార్ 156!



ఈ నేపథ్యంలో సోషియా ఫాంటసీ టచ్ ఇవ్వాలన్నా! చాలా మంది మేకర్స్ ఆలోచిస్తున్నారు. తెలుగులో సరైన సోషియా ఫాంటసీ చిత్రాలొచ్చి చాలా కాలమవుతోంది. కొంత కాలంగా ట్రెండ్ సస్పెన్స్ థ్రిల్లర్..యాక్షన్ థ్రిల్లర్ లదే కావడంతో! కంటెంట్ ని ఎక్కువగా హైలైట్ చేస్తున్నారు. ఓటీటీలో కూడా అలాంటి కంటెంట్ కి ఎక్కువ ప్రాధాన్యత ఉంటడంతో మార్కెట్ ని దృష్టి లో పెట్టుకుని సినిమాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోషియా ఫాంటసీ టచ్ ఇవ్వాలన్నా! చాలా మంది మేకర్స్ ఆలోచిస్తున్నారు. సోషల్ ఫాంటసీలో ఎక్కడ చిన్న తప్పు జరిగినా డ్యామేజ్ అలాగే ఉంటుంది. అందుకే సోషియా ఫాంటసీని టచ్ చేయడం అన్నది అందరికీ సాధ్యమయ్యేది కాదు. అందులోనూ ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించి చందమామ లాంటి కథ చెప్పాలంటే ధైర్య సాహసాలుండాలి. అలాంటి ప్రయత్నమే యువ దర్శకుడు వశిష్ట చేస్తున్నట్లు కనిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా 156వ చిత్రాన్ని ఆయన తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. దీన్ని సోషియో ఫాంటసీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిస్తున్నారు. కాన్సెప్ట్ ఎలా ఉంటుందన్నది తెలియదు గానీ ఇది ఓ చందమామ కథలో అంద్భుతంగా ఉంటుందని.. ప్రేక్షకుల ను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తున్న సినిమా అని అంటున్నారు. చిరంజీవికి సైతం ఇందులో పాత్ర సవాల్ విసురుతుందని...ఆ రేంజ్ లో హీరో పాత్రని వశిష్ట డిజైన్ చేసినట్లు..అందుకు చిరంజీవి ప్రత్యేకంగా సన్నధం అవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. చిరంజీవి ఆహార్యం సహా ప్రతీది చాలా కొత్తగా ఉంటుందని.. సినిమాలో వాడే ప్రతీ నటుడి కాస్ట్యూమ్స్ అన్నీ కొత్త గా ఉంటాయని అంటున్నారు. సినిమా కోసం అత్యుత్తమ టెక్నాలజీని వినియోగిస్తున్నారుట. సీజీ పరంగా రిచ్ గా ఉండేలా ఓ పెద్ద కంపెనీతో ఒపందం చేసుకున్నట్లు వినిపిస్తుంది. ఈసినిమాకి విశ్వంభర అనే టైటిల్ కూడా ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఇక సోషియా ఫాంటసీ సినిమాలు చిరంజీవికి కొత్తేం కాదు. జగదేక వీరుడు అతిలోక సుందరి.. యముడుకి మొగుడు.. అంజి లాంటి సినిమాలు సోషియా ఫాంటసీ టచప్ ఉన్న చిత్రాలే. అవన్నీ మెగాస్టార్ ని వెండి తెరపై కొత్తగా ఆవిష్కరించినవే.

# నాగార్జున 'నా సామిరంగ' నుంచి విజిల్ థీమ్ సాంగ్ విడుదల




టాలీవుడ్ కింగ్ నాగార్జున ప్రధాన పాత్రలో కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'నా సామిరంగ'. తాజాగా ఈ చిత్రం నుంచి విజిల్ థీమ్ సాంగ్ రిలీజైంది. దేవుడే... తన చేతితో... రాసిన... ఒక కావ్యం... అంజిది, కిష్టయ్యది విడదీయని ఒక బంధం... అంటూ సాగే ఈ గీతం నా సామిరంగ చిత్రంలో నాగార్జున, అల్లరి నరేశ్ ల మధ్య స్నేహానుబంధాన్ని చాటుతోంది. ఎంఎం కీరవాణి ఈ పాటకు బాణీలే కాదు లిరిక్స్ కూడా అందించారు. ఈల పాటగా పాడుకోగలిగేంత ఆహ్లాదకరంగా ఉన్న ఈ గీతాన్ని శాండిల్య పీసపాటి ఆలపించారు.

# భీమా టీజర్ టాక్ : బ్రహ్మ రాక్షసుడు వచ్చేశాడు




టాలీవుడ్ మాచో స్టార్ గోపీచంద్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం భీమా. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాకు కన్నడ దర్శకుడు ఏ హర్ష దర్శకత్వం వహిస్తుండగా.. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి మోషన్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేయగా.. అభిమానుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ భీమా మూవీ టీజర్ ను రిలీజ్ చేశారు. మూవీ రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు. యధా యధా ధర్మస్య శ్లోకం తో మొదలైన టీజర్ తెగ ఆకట్టు కుంటోంది. గోపి చంద్ ఎలివేషనలు అదిరిపోయాయి. టీజర్ తో సినిమా పై అంచనాలు పెరిగిపోయాయి. ఓ సరికొత్త కాన్సెప్ట్ తో ఆద్యంతం ఆసక్తికరంగ్గా టీజర్ ఉందని ఫ్యాన్స్ అంటున్నారు. ఈ రాక్షసుడుని వేటాడే బ్రహ్మ రాక్షసుడు వచాడ్రా అంటూ బ్యాక్ గ్రౌండ్ డైలాగు వస్తుంటే గోపి చంద్ ఎంట్రీ గూస్ బంప్స్ తెప్పిస్తుంది. దున్నపోతు పై హీరో పోజు కేక అని నెటిజన్లు అంటున్నారు. ఈ సినిమా తో గోపీచంద్ కమ్ బ్యాక్ పక్కా అని కామెంట్స్ చేస్తున్నారు. ఈ సినిమాలో యాక్షన్ హీరో గోపీచంద్ పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. తమ టీమ్ అందరం ఎంతో కష్టపడ్డ భీమా తప్పక విజయం అందుకుంటుందని మేకర్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. %వస్ఝ% శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. సలార్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రామ్-లక్ష్మణ్, వెంకట్, డాక్టర్ రవివర్మ కొరియోగ్రఫీలో ఫైట్స్ ఉండబోతున్నాయి. ఇక సినిమా రిలీజ్ పై చాలా రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్ కు మేకర్స్ ఒక సమాధానం ఇచ్చారు. మొత్తానికి రిలీజ్ డేట్ పై క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమాను ఈ ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. తప్పకుండా ఈ సినిమాతో గోపిచంద్ సక్సెస్ అందుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే చాలా కాలంగా అతనికి బాక్సాఫీస్ వద్ద సరైన సక్సెస్ లేదు. ముఖ్యంగా చివరి సినిమా రామబాణం దారుణంగా డిజాస్టర్ అయ్యింది. దీంతో గోపి ఈ సినిమాతో తప్పనిసరిగా హిట్ కొట్టాలని అనుకుంటున్నాడు. మరి అతనికి ఈ సినిమా ఎలాంతో ఫలితాలు అందిస్తుందో చూడాలి.

# 'కనా' కి ఛాన్స్ ఇచ్చిన లేడీ సూపర్ స్టార్!



లేడీ సూపర్ స్టార్ నయనతార జవాన్ సినిమా తర్వాత బాలీవుడ్ లోనూ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా గుర్తింపు దక్కించుకుంది. అయితే హిందీలో కంటే సౌత్ లో అది కాకుండా తమిళ్ లోనే ఎక్కువ సినిమాలు చేయాలనే ఉద్దేశ్యంతో నయనతార ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తన భర్త విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఒక సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న నయనతార, మరో రెండు సినిమాల్లో కూడా నటిస్తోంది. అందులో ఒకటి నయన్ 75వ సినిమా అవ్వడం విశేషం. మొత్తంగా మూడు సినిమాలకు కమిట్ అయ్యి ఇప్పటికే షూటింగ్ దశలో ఉన్నాయి. వాళ్ళకి నాగవంశీ మాస్ కౌంటర్? మూడు సినిమాలు షూటింగ్ దశలో ఉండగానే కొత్త సినిమాకు సంబంధించిన చర్చలు జరుపుతున్నట్లు సమాచారం అందుతోంది. ఐశ్వర్య రాజేష్ తో కనా అనే సినిమాను రూపొందించి విజయాన్ని సొంతం చేసుకున్న దర్శకుడు అరుణ్ రాజా కామరాజ్ దర్శకత్వంలో నయన్ ఒక సినిమా చేయబోతుంది. ఇటీవల ఉదయనిధి స్టాలిన్ తో ఒక సినిమాను చేసిన అరుణ్ రాజా మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. బ్యాక్ టు బ్యాక్ విజయాలు సొంతం చేసుకున్న ఈ దర్శకుడితో నయనతార వర్క్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక లేడీ ఓరియంటెడ్ స్క్రిప్ట్ రెడీ అయ్యిందని తెలుస్తోంది. విభిన్న చిత్రాలు చేసుకుంటూ కెరీర్ లో ముందుకు సాగుతున్న అన్నపూరణి సినిమా తో నయన్ ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఫలితం విషయం అటుంచి, ఆ సినిమాలో ఈ అమ్మడి నటనకు మంచి మార్కులు పడుతున్నాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.Title Code TELTEL02086.E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613